సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం । 19 । అక్టోబర్ । 2023

న్యూస్‌రీల్

నేడు, రేపు ప్రెస్ అకాడమి చైర్మన్ కొమ్మినేని పర్యటన



సాక్షి,పాడేరు: ఏపీ ప్రెస్ అకాడమి చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఈనెల 19,20తేదీల్లో అరకులోయ, పాడేరు ప్రాంతాల్లో పర్యటిస్తారు. పార్వతీపురం పర్యటనలో ఉన్న ఆయన 19వతేదీ గురువారం సాయంత్రం అరకులోయ చేరుకుంటారు. రాత్రి అక్కడే బస చేస్తారు. 20వతేదీఉదయం అరకులోయ, పాడేరు ప్రాంతాల్లో స్థానికంగా ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. మధ్యాహ్నం పాడేరు నుంచి కాకినాడ జిల్లా అన్నవరం వెళ్తారని అధికారవర్గాలు తెలిపాయి.

జిప్‌లైన్ ప్రారంభం వాయిదా

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన బొర్రాగుహలను ఆనుకుని ఉన్న గోస్తనీ నదిపై ఏర్పాటుచేసిన జిప్‌లైన్ ప్రారంభం వాయిదా పడింది. శుక్రవారం కలెక్టర్ చేతులమీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్టు సంబంధిత అధికారవర్గాలు తెలిపాయి.

20న చింతపల్లిలో జగనన్నకు చెబుదాం

సాక్షి,పాడేరు: ఈనెల 20న చింతపల్లి మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. చింతపల్లి మండలంలోని ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలపై వినతులు అందజేయాలన్నారు.అన్నిశాఖల జిల్లా అధికారులు స్పందనకు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన ఆదేశించారు. మధ్యాహ్నం 2గంటల తరువాత అధికారులు సంబంధిత శాఖల క్షేత్రస్థాయి సిబ్బందితో సమావేశాలు నిర్వహించాలని ఆయన సూచించారు.

ఐటీడీఏలో స్పందన రద్దు

పాడేరు ఐటీడీఏలో శుక్రవారం స్పందన కార్యక్రమాన్ని రద్దు చేశామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని ప్రజలంతా గమనించి పాడేరు ఐటీడీఏకు రావొద్దని సూచించారు. చింతపల్లి మండల ప్రజలు మాత్రం చింతపల్లిలో జరిగే జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఉచిత సివిల్స్ శిక్షణకు మొదటి దశలో 529 మంది ఉత్తీర్ణత

- 22న రెండో దశ పరీక్ష
- 27,28 తేదీల్లో ఇంటర్వ్యూలు
- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



పాడేరు రూరల్ : పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ లక్ష్య పేరుతో గిరిజన విద్యార్థులకు సివిల్ సర్వీసెస్ పరీక్షకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు విద్యార్థుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని ఐటీడీఏ పీవో వి. అభిషేక్ తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మొదటి దశ స్క్రీనింగ్ పరీక్షకు 1844 మంది దరఖాస్తు చేసుకోగా 1750 మంది హాజరయ్యారన్నారు. ఫలితాల అనంతరం వీరిలో 529 మంది విద్యార్థులను రెండో దశ స్క్రీనింగ్ పరీక్షకు ఎంపిక చేశామన్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను ఐటీడీఏ కార్యాలయం నోటీసు బోర్డులో పొందుపర్చామన్నారు. వీరికి ఈనెల 22న రెండో దశ స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్షలో నెగిటివ్ మార్కులు ఉంటుందన్నారు. రెండో దశ పరీక్షకు సంబంధించి ఈనెల 20 నుంచి హాల్ టికెట్లు జారీ చేస్తామన్నారు. 22న పాడేరులో పరీక్ష నిర్వహించి 24న ఫలితాలు వెల్లడించి ఎంపికైన వారికి 27,28తేదీల్లో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. వీరిలో ఎంపికైన 50 మందిని విశాఖపట్నంలోని వేపగుంట యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో నవంబర్ ఒకటో తేదీ నుంచి శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు.

మార్కెట్లో పసుపు ధర క్రమేపీ పెరుగుతుండటంతో గిరి రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఒక దశలో పతనమైన ధర మళ్లీ పెరగడం ఊరటనిస్తోంది. సేంద్రియ విధానంలో పండించడం వల్ల మన్యం పసుపునకు మంచి డిమాండ్ ఉంది.

పసుపు రైతుకు ఊరట



పసుపు పంటకు ఈ క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

- క్రమేపీ పెరుగుతున్న ధర
- కలిసివస్తున్న మార్కెట్ పరిస్థితులు
- ఆనందంలో గిరి రైతులు

పెదబయలు: జిల్లాలో పసుపు సాగు రైతులకు సిరులు కురిపిస్తోంది.మంచి ఛాయ పసుపు సాగు చేసే ప్రాంతంగా విశాఖ మన్యానికి గుర్తింపు ఉంది. గిరిజన ప్రాంతంలో ప్రతీ రైతు తమ కున్న ప్రదేశంలో కొంత భాగం పసుపు సాగుకు కేటాయిస్తారు. పసుపు సాగు చేయని రైతు ఉండరు. అంతగా పసుపు పంటకు మన్యానికి అనుబంధం ఉంది. జిల్లాలోని 22 మండలాల పరిధిలో 27 వేల హెక్టార్లలో పసుపు పండిస్తుండగా 22 వేల ఎకరాల రైతులు ఈక్రాప్ నమోదు చేసుకున్నారు.

సేంద్రియ విధానంతో..

జిల్లాలో పాడేరు ఐటీడీఏ పరిధిలోని 11 మండలాల్లో పసుపును సేంద్రియ విధానంలో పండిస్తున్నారు. ఎరువుగా పశువుల గెత్తం వినియోగించడం వల్ల పసుపు నాణ్యతగా ఉంటుంది. ఇక్కడ పండించే పసుపునకు జాతీయస్థాయిలో మంచి డిమాండ్ ఉంది. గిరి రైతుల నుంచి పసుపును కొనుగోలు చేసి దేశంలోని ప్రముఖ దేవాలయాలకు గిరిజన సహకార సంస్థ సరఫరా చేస్తోంది.

పెరుగుతున్న ధర

పసుపు ధర క్రమేపీ పెరుగుతోంది. దసరాలో వినియోగం ఎక్కువ ఉంటున్నందున ధర మరింత పెరిగే అవకాశం ఉంది. గత ఏప్రిల్‌లో కిలో పసుపు కిలో రూ. 65 నుంచి రూ.70 వరకు ధర పలికింది. ప్రస్తుతం వారపు సంతల్లో కిలో రూ.95 నుంచి రూ.98 ధర ఉంది.

మెరుగ్గా దిగుబడి

ఎకరాన్నర విస్తీర్ణంలో పసు పు పంట వేశా. సుమారు 15 కిలోల పసుపు దిగుబడి వచ్చింది. అయితే ఎలాంటి ఎరువులు వాడకుండా సేంద్రియ విధానంలో పండించా. అయితే వారపు సంతల్లో ధర కాస్త తక్కువగా ఉంది. నిల్వ చేసుకుని అమ్మితే మంచి ధర వచ్చే అవకాశం ఉంది. ఆ దిశగా గిరి రైతులంతా దూర దృష్టితో ఆలోచించాలి.

– పోయిభ బాలయ్య దొర, సర్పంచ్, కొరవంగి పంచాయతీ

సూచనలు పాటిస్తే మంచి ఆదాయం

జిల్లాలో 22 వేల ఎకరాల్లో పసుపు పంటకు రైతులు ఈ క్రాప్ నమోదు చేసుకున్నారు. ఉద్యానవనశాఖ సూచనలు పాటిస్తే మంచి ఆదాయం పొందవచ్చు. వర్షాలు ఎక్కువగా కురిసిన నేపథ్యంలో దుంపకుళ్ల సోకే అవకాశం ఉంటుంది. భూమిలో నీరు నిల్వ లేకుండా చూసుకుంటే సరిపోతుంది.

– రమేష్, జిల్యా ఉద్యానవన అధికారి, పాడేరు

వైద్యసేవలు మరింత చేరువ



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



అన్నప్రాసన చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే పాల్గుణ

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- పాతకోటలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ప్రారంభం
- 407 మందికి వైద్య పరీక్షలు

హుకుంపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వల్ల వైద్యసేవలు మరింత చేరువయ్యాయని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని పాతకోటలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన అరకు ఎమ్మెల్యే చెట్టిపాల్గుణతో కలిసి బుధవారం ప్రారంభించారు. శిబిరానికి వచ్చిన రోగులతో మాట్లాడారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పౌష్టికాహార స్టాల్‌ను ఆయన పరిశీలించారు. సీమంతం, అన్నపాసన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో గిరిజనులు ఆరోగ్య విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ జగనన్న సురక్ష పేదల ఆరోగ్యానికి రక్ష అని అన్నారు. సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. శిబిరంలో 407మందికి వైద్యసేవలు అందించినట్టు వైద్యాధికారులు అనూషా, జగన్నాథం, శివమణి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఆర్ఐ సీతమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఎం.విశ్వేశ్వరరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎస్.కొండలరావు, సర్పంచ్ పాటి లక్ష్మి, ఎంపీటీసీ కొండమ్మ పాల్గొన్నారు.

అరకులోయకు పర్యాటకుల తాకిడి

అరకులోయ టౌన్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయలో బుధవారం పర్యాటకుల తాకిడి పెరిగింది. గిరిజన మ్యూజియం, పద్మాపురం ఉద్యానవనం సందర్శకులతో కళకళలాడింది. ప్రధాన రహదారుల్లో పర్యాటలు సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేశారు. రణజిల్లెడ జలపాతం, మాడగడ సన్ రైజర్స్ పాయింట్‌కు వెళ్లే రహదారులు రద్దీగా మారాయి.

ఆశాజనకంగా రాజ్‌మా

- ప్రభుత్వ ప్రోత్సాహంతో గిరి రైతులకు మేలు



పోడు భూముల్లో సాగు చేస్తున్న రాజ్‌మా

జి.మాడుగుల: జిల్లాలో రాజ్‌మా సాగుకు వాతావరణం అనుకూలించింది. పైరు ఆశాజనకంగా ఉన్నందున గిరి రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ప్రభుత్వం అందిస్తున్న సహకారం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఒక పక్క రైతు భరోసా సాయం.. మరోపక్క 90 శాతం రాయితీపై విత్తనాల సరఫరా చేసి రాష్ట్ర ప్రభుత్వ పోత్సహించింది. దీంతో సాగు విస్తీర్ణం పెరిగింది. జిల్లాలో పాడేరు డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో 9,106 హెక్టార్లలో 25 వేల మంది రైతులు సాగు చేపట్టారు. పోలీసుశాఖ పరివర్తన కార్యక్రమంలో 4,553 క్వింటాళ్ల విత్తనాన్ని వ్యవసాయశాఖ సరఫరా చేసింది, కిలో విత్తనం రూ.138.60 కాగా 90 శాతం రాయితీపై రూ.15.40కు ప్రభుత్వం అందించింది.

మంచి దిగుబడి వచ్చే అవకాశం

ఈ ఏడాది వాతావరణం అనుకూలంగా ఉంది. వర్షాలు ఎంతో ఉపయోగపడ్డాయి. మంచి దిగుబడి వచ్చే అవకాశం కనిపిస్తోంది. మార్కెట్ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి.

– లక్ష్మీనాయుడు, రాజ్‌మా రైతు, గడుతూరు

అన్ని రకాలుగా ప్రోత్సాహం

రాజ్‌మా రైతులకు ప్రభుత్వ పరంగా అన్నిరకాలుగా సహకారం అందిస్తున్నాం. రాయితీపై విత్తనాలు సరఫరా చేయడం వల్ల సాగు పెట్టుబడి తగ్గింది. మార్కెట్‌లో ధర బాగుంది. మంచి ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

– ఎస్‌బీఎస్ నందు, జిల్లా వ్యవసాయాధికారి, పాడేరు

విశాఖ పరిపాలన రాజధానితో గిరిజన ప్రాంతాల అభివృద్ధి



మన విశాఖ,మన రాజదాని ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పాడేరు,అరకు ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, పాల్గుణ,జేఏసీ కన్వీనర్ లజపతిరాయ్,ట్రైకార్ చైర్మన్ బుల్లిబాబు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: విశాఖ పరిపాలన రాజధాని వల్ల ఉత్తరాంధ్రలోని వెనుకబడిన గిరిజన ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని వెఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. రాష్ట్రంలో పరిపాలన వికేంద్రీకరణ, విశాఖ రాజధానికి మద్దతుగా స్థానిక మోదకొండమ్మతల్లికి ఉత్తరాంధ్ర నాన్‌పొలిటికల్ జేఏసీ కన్వీనర్ హనుమంతు లజపతిరాయ్ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాడేరు,అరకు ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, జేఏసీ కన్వీనర్ లజపతిరాయ్, ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు తదితరులు కొబ్బరికాయలు కొట్టారు. మన విశాఖ–మనరాజధాని ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాడేరు ఎమ్మెల్యే మాట్లాడుతూ విశాఖ పరిపాలన రాజధాని నిర్ణయం చారిత్రాత్మకమన్నారు. విశాఖ పరిపాలన రాజధానిని గిరిజనులమంతా స్వాగతిస్తున్నామన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో పనిచేస్తున్నారన్నారు. కర్నూలులో న్యాయరాజధాని,అమరావతిలో శాసన రాజధాని,విశాఖలో పరిపాలన రాజధానిని అన్ని వర్గాల ప్రజలు స్వాగతిస్తున్నారన్నారు.అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఉత్తరాంధ్రలోని పెద్ద ఎత్తున పరిశ్రమలు ఏర్పడడంతో ఉద్యోగ,ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. నాన్‌పొలిటికల్ జేఏసీ కన్వీనర్, ప్రొఫెసర్ హనుమంత్ లజపతిరాయ్ మాట్లాడుతూ విశాఖలో పరిపాలన రాజధానితో ఉత్తరాంధ్రలోని అన్ని గిరిజన ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు.ఉత్తరాంధ్రలోని అన్ని ప్రాంతాలను సందర్శించి ప్రధాన దేవాలయాల్లోను ప్రత్యేక పూజలు చేస్తున్నామన్నారు.ప్రజలంతా పరిపాలన వికేంద్రీకరణను కోరుకుంటున్నారని ఆయన తెలిపారు.రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు మాట్లాడుతూ విశాఖపట్నంలో పరిపాలన రాజధానితో ఉమ్మడి విశాఖ జిల్లాలోని గిరిజన ప్రాంతమంతా అభివృద్ధి చెందుతుందన్నారు.పాడేరు మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, మండల పార్టీ అధ్యక్ష,ఉపాధ్యక్షులు సీదరి రాంబాబు, పి. సత్యనారాయణ, ఎంపీటీసీ లకే రామకష్ణపాత్రుడు,వనుము బసవన్నదొర,సర్పంచ్‌లు గబ్బాడి చిట్టిబాబు,వంతాల రాంబాబు, వంతాల సీతమ్మ,సన్నిబాబు,పాడేరు,అరకులోయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు గబ్బాడ రాజబాబు,కిరసాని రాందాస్ పాల్గొన్నారు. హనుమంతు లజపతిరాయ్‌ను పాడేరు,అరకులోయ ఎమ్మెల్యేలు ఘనంగా సన్మానించారు. అమ్మవారి ఫొటోను అందజేశారు.



లజపతిరాయ్‌ను సత్కరిస్తున్న పాడేరు.అరకు ఎమ్మెల్యేలు కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి,చెట్టి పాల్గుణ

తగ్గుతున్న ఉష్ణోగ్రతలు



పాడేరు పాత బస్టాండ్ అంబేద్కర్ సెంటర్‌లో ఉదయం ఎనిమిది గంటలకు దట్టంగా కురుస్తున్న పొగమంచు



చాపరాయిని కమ్మేసిన పొగమంచు

సాక్షి,పాడేరు: మన్యంలో చలిగాలులు ప్రారంభమయ్యాయి.పొగమంచు దట్టంగా కురుస్తోంది.ఉదయం 9గంటల వరకు మంచుతెరలు కమ్ముకుంటున్నాయి. పాడేరు డివిజన్ వ్యాప్తంగా పొగమంచు నెలకొంది.పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డులో 16డిగ్రీలు,అరకులోయ కాఫీబోర్డులో 17.3డిగ్రీలు, చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వద్ద 16.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు బుధవారం నమోదయ్యాయి.

డుంబ్రిగుడ: మండలంలోని వారం రోజుల నుంచి పొంగ మంచు తీవ్రంగా కురుస్తోంది. ఉదయం 9 గంటల వరకు మంచు తెరలు వీడటం లేదు. ఈ ప్రాంతానికి వచ్చిన పర్యాటకులు మంచు అందాలను చూసి మురిసిపోతున్నారు.

అరకులోయ టౌన్: శీతాకాలం ప్రారంభం కావడంతో గిరిజన ప్రాంతంలో మంచు వర్షంలా కురుస్తోంది. రాత్రి 12 గంటలు ఉదయం తొమ్మిది గంటల వరకు మంచు దట్టంగా కురుస్తోంది.

క్లుప్తంగా

నేడు ఆర్‌ఎంపీలకు అవగాహన కార్యక్రమం

చింతూరు: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో చింతూరు, ఎటపాక మండలాలకు చెందిన ఆర్‌ఎంపీ వైద్యులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య బుధవారం తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే ఆర్‌ఎంపీ వైద్యులంతా తమ విద్యార్హతలు, ఇతర ధ్రువపత్రాలు తీసుకురావాలని ఆయన సూచించారు.

ఆహారం సరఫరాకు దరఖాస్తుల ఆహ్వానం

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు రూరల్ : పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో విశాఖపట్నం వేపగుంట యూత్ ట్రెనింగ్ సెంటర్‌లో అర్హులైన గిరిజన అభ్యర్థులకు నిర్వహించనున్న ఉచిత సివిల్స్ శిక్షణలో నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐటీడీఏ పీవో వి. అభిషేక్ తెలిపారు. తొమ్మిది నెలలపాటు 50 మంది గిరిజన విద్యార్థులతో పాటు అధ్యాపకులకు అప్పటికప్పుడు తయారు చేసిన ఆహారం అందించాలన్నారు.

ప్రతిపాదిత మెనూ ప్రకారం ఒక్కొక్కరికి రోజుకు రూ.200లకు మించకుండా ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం సరఫరా చేయాల్సి ఉంటుందన్నారు. వేపగుంట యూత్ ట్రెనింగ్ సెంటర్ ప్రాంగణంలోనే ఆహార పదార్థాలు తయారు చేయాలన్నారు. ఆసక్తి గల సంస్థలు, హోటళ్ల యజమానులు, వ్యక్తుల నుంచి ఈనెల 19 సాయంత్రం వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. వీటిని పరిశీలించిన తరువాత ఎంపిక చేస్తామన్నారు.

రసవత్తరంగా కబడ్డీ పోటీలు

మాకవరపాలెం: ఉత్తరాంధ్ర స్థాయి కబడ్డీ పోటీలు రసవత్తరంగా సాగాయి. దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ఉన్నత పాఠశాలలో తామరం గ్రామానికి చెందిన గంగిరెడ్ల నాయుడు ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పలు మండలాల నుంచి 36 టీంలు పాల్గొన్నాయి. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.16,000, ద్వితీయ బహుమతిగా రూ.13,000, తృతీయ రూ.10,000, నాల్గవ బహుమతిగా రూ.7,000 నగదు అందజేస్తామని నిర్వాహకుడు నాయుడు తెలిపారు.

ఉద్యోగ కల్పన కేంద్రాలుగా స్కిల్ హబ్ సెంటర్లు

- ప్రతి నియోజకవర్గానికి ఒక స్కిల్ హబ్, అదనంగా నాక్ శిక్షణ కేంద్రం
- ఏడు స్కిల్ హబ్‌ల ద్వారా ప్రారంభమైన శిక్షణ
- ప్రొడక్షన్ కెమిస్ట్రీ, డొమెస్టిక్ డేటా ఆపరేటర్, జీడీ అసిస్టెంట్, నర్సింగ్ కోర్సులు
- బ్యాచ్‌కు 30 నుంచి 60 మంది చొప్పున మూడు నెలల శిక్షణ
- ఇంటర్, అంతకంటే తక్కువ విద్యార్హత ఉన్న వారికి కూడా నైపుణ్య శిక్షణ
- ఈ ఏడాదిలో జిల్లాలో 655 మందికి శిక్షణ కల్పిస్తే..423 మందికి ఉద్యోగాలు
- మరో 270 మందికి కొనసాగుతున్న శిక్షణ

నిరుద్యోగ యువకులకు స్కిల్ హబ్ సెంటర్లు వరంగా మారాయి. ఈ సెంటర్ల ద్వారా జిల్లాలో వేలాది మందికి ఉచిత నైపుణ్య శిక్షణ ఇచ్చి, ఉద్యోగాలు కల్పిస్తున్నారు. జిల్లాలో ఏడు స్కిల్ హబ్‌ల ద్వారా శిక్షణ ఇస్తున్నారు.



స్కిల్ ట్రెనింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న నిరుద్యోగులు

సాక్షి, అనకాపల్లి: విద్యార్హతలు, నైపుణ్యాన్ని బట్టి అందరికీ తగిన ఉపాధి లభించాలి.. ఇది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసం నిరుద్యోగులకు వివిధ ట్రేడ్‌లలో శిక్షణ ఇవ్వడమే కాకుండా ఉద్యోగావకాశాలను కూడా కల్పిస్తున్నారు. దీని కోసం రాష్ట్రంలో రెండు స్కిల్ యూనివర్సిటీలు, ప్రతి పార్లమెంట్ నియెజకవర్గంలో ఒక స్కిల్ కాలేజీ, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో స్కిల్ హబ్ సెంటర్ ఏర్పాటు చేయాలని సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారు. అందులో భాగంగా జిల్లాలో ఉన్న నిరుద్యోగులకు 'స్కిల్ హబ్' పేరిట శిక్షణ కల్పించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. డిగ్రీ, ఇంటర్మీడియట్, అంతకంటే తక్కువ చదువు ఉన్న నిరుద్యోగులకు ఉపాధి కల్పించే లక్ష్యంలో భాగంగా ప్రతి నియోజకవర్గంలో ఒక స్కిల్ హబ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో ఆరు స్కిల్ హబ్‌ల ద్వారా శిక్షణ కల్పిస్తున్నారు. ఇంటర్మీడియట్, అంతకంటే తక్కువ చదువు ఉన్న నిరుద్యోగులకు ఉపాధి కల్పించే లక్ష్యంలో భాగంగా ప్రతి నియోజకవర్గంలో ఒక స్కిల్ హబ్ ఏర్పాటు చేశారు.

మూడు నెలల శిక్షణ కాలం..

ఈ ఏడాదిలో స్కిల్ హబ్‌ల ద్వారా జిల్లాలో 655 మంది నిరుద్యోగులకు శిక్షణ అందించగా వారిలో 423 మందికి శిక్షణ అనంతరం ఉద్యోగాలు కల్పించారు. మరో 270 మందికి ప్రస్తుతం శిక్షణ ఇస్తున్నారు. స్కిల్ హబ్‌లో ఒక్కో బ్యాచ్‌లో 30 నుంచి 60 మందికి వరకూ ఉంటారు. వీరికి 90 రోజుల పాటు శిక్షణ ఇస్తారు. మొత్తం ఏడు శిక్షణ కేంద్రాల్లో పలు కోర్సులు ఏర్పాటుచేశారు. వాటిలో ప్రధానమైనవి ప్రొడక్షన్ కెమిస్ట్రీ, డొమెస్టిక్ డేటా ఆపరేటర్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్, సీఆర్‌ఎం డొమెస్టిక్ నాన్‌వాయిస్. వీటితో పాటు పలు కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. పరిశ్రమలకు అనుసంధానంగా ఇక్కడ శిక్షణ కల్పిస్తున్నారు. డిగ్రీ(బీఎస్సీ) కెమిస్ట్రీ పూర్తిచేసినవారికి ప్రొడక్షన్ కెమిస్ట్రీ కోర్సును డిజైన్‌చేశారు. 'జనరల్ డ్యూటీ అసిస్టెంట్', 'నర్సింగ్ కోర్సు' సీఆర్‌ఎం డొమెస్టిక్ నాన్‌వాయిస్ శిక్షణకు పదో తరగతి పాస్ అయిన వారందరూ అర్హులు. ఈ కోర్సు శిక్షణ కాలం మూడు నెలలు. శిక్షణ కాలంలో ఇండస్ట్రియల్ నిపుణులతో ప్రత్యేక క్లాస్‌లను ఏర్పాటుచేస్తారు. కోర్సులో 30 నుంచి 40 మంది వరకు శిక్షణ కల్పిస్తారు.

- అనకాపల్లి రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లో 'జనరల్ డ్యూటీ అసిస్టెంట్ కోర్సు', సీఆర్‌ఎం డొమెస్టిక్ నాన్‌వాయిస్‌లకు గానూ 101 మందికి శిక్షణ అందించారు. వీరిలో 88 మందికి ఉద్యోగాలు కల్పించారు. ప్రస్తుతం మరో 60 మందికి శిక్షణ ఇస్తున్నారు
- నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లో ప్రొడక్షన్ కెమిస్ట్రీ, డొమెస్టిక్ డేటా ఆపరేటర్ కోర్సుల్లో 101 మందికి శిక్షణ అందించగా, వారిలో 88 మందికి ఉద్యోగాలు కల్పించారు. మరో 30 మంది ప్రస్తుతం శిక్షణ పొందుతున్నారు
- చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలో 115 మందికి శిక్షణ ఇవ్వగా, వారిలో 73 మందికి ఉద్యోగాలు కల్పించారు. మరో 60 మంది ప్రస్తుతం శిక్షణ పొందుతున్నారు.
- మాడుగుల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 79 మందికి శిక్షణ ఇవ్వగా, వారిలో 47 మందికి ఉద్యోగాలు కల్పించారు.
- పాయకరావుపేట ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 85 మందికి శిక్షణ ఇచ్చి, 47 మందికి ఉద్యోగాలు కల్పించారు. మరో 30 మందికి రేపటి నుంచి శిక్షణ ప్రారంభమవుతుంది.
- యలమంచిలిలో 107 మందికి శిక్షణ ఇవ్వగా వారిలో 62 మందికి ఉద్యోగాలు కల్పించారు. మరో 30 మంది శిక్షణ పొందుతున్నారు.
- నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలెం నాక్ ట్రెనింగ్ సెంటర్‌లో 60 మందికి శిక్షణ ఇవ్వగా, వారిలో 37 మందికి ఉద్యోగాలు కల్పించారు. మరో 60 మంది ప్రస్తుతం శిక్షణ తీసుకుంటున్నారు.

శిక్షణ పొందిన ప్రతి ఒక్కరికీ ఉద్యోగం



ప్రతి నియోజకవర్గంలో ఒక స్కిల్ హబ్‌ని ఏర్పాటు చేశాం. స్థానికంగా ఉన్న పరిశ్రమలకు అవసరమైన మానవ వనరులను అందించే విధంగా కోర్సులను సిద్ధం చేశాం. శిక్షణ పూర్తయిన తర్వాత ఆయా సంస్థలే ఉపాధి కల్పిస్తాయి. నిరుద్యోగులకు ఇది మంచి వరం. రవాణా సదుపాయం కోసం నెలకు రూ.1000 అందిస్తున్నాం. ఇప్పటికే ఆరు నియోజకవర్గాల్లో ఆరు నైపుణ్య కేంద్రాల ద్వారా శిక్షణ అందించడమే కాకుండా.. మాకవరపుపాలెం నాక్ సెంటర్ కూడా ఏర్పాటుచేశాం.

– ఛాముండేశ్వర రావు, అనకాపల్లి జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి

సకాలంలో భూ రీసర్వే

- వెనుకంజలో పెదబయలు మండలం
- వీడియో కాన్ఫరెన్స్‌లో ఐటీడీఏ పీవో అభిషేక్



సూచనలిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు రూరల్ : భూముల రీసర్వే వేగవంతం చేయాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు. బుధవారం ఆయన భూముల రీసర్వేపై తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, డీఐవో, ఐఎస్‌వోలు, రీసర్వే ఏజెన్సీలతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. అన్ని మండలాల్లో రీసర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. రీసర్వేలో పెదబయలు మండలం పూర్తిగా వెనుకబడి ఉందన్నారు. ప్రతి బుధవారం భూముల రీసర్వేపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఐటీడీఏ పరిధిలోని 11 మండలాల్లోని పాఠశాలల్లో చేపడుతున్న మనబడి–నాడునేడు రెండో విడత పనులను సకాలంలో పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో వి. అభిషేక్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో మనబడి నాడు-నేడు సంబంధిత అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్లు, ఇంజనీరింగ్ అధికారులు, విద్యాశాఖ అధికారులు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి బిల్లులను అప్లోడ్ చేయాలన్నారు. అసిస్టెంట్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్లు మనబడి నాడునేడు పనులపై వర్క్‌షాప్ నిర్వహించాలని ఆయన ఆదేశించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



ఊడిన బస్సు టైరును అమర్చుతున్న దృశ్యం

సీలేరు: దారాలమ్మ తల్లి ఘాట్ రోడ్డులో సీలేరు నుంచి నర్సీపట్నం వెళ్తున్న ఆర్టీసీ బస్సుకు పెద్ద ప్రమాదం తప్పింది. ఘాట్ రోడ్డులో మలుపు తిరుగుతుండగా బస్సు యొక్క వెనుక చక్రం అకస్మాత్తుగా ఊడిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. డ్రైవర్ చాకచక్యంతో ప్రమాదం జరగకుండా బస్సును నిలిపివేశాడు. పెద్దప్రమాదం తప్పడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. ఊడిపోయిన చక్రాన్ని తీసి యథావిధిగా అమర్చి రాకపోకలు సాగించారు. ఒకవేళ డ్రైవర్ గమనించక పోతే బస్సు లోయలోకి పడిపోయేదని, ప్రాణ నష్టం ఎక్కువగా జరిగేదని ప్రయాణికులు చెప్పారు.

క్రీస్తు బోధనలు ఆచరణీయం

- ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు

హుకుంపేట: క్రీస్తు బోధనలు మానవాళికి ఆచరణీయమని ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు అన్నారు. మండలంలోని గత్తుం పంచాయతీ కిముడుపుట్టు గ్రామంలో ఆయన బుధవారం పర్యటించారు. ఈ నేపథ్యంలో స్థానిక ప్రేయర్ పవర్ క్రైస్తవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యేసుక్రీస్తు అందించిన శాంతి, ప్రేమ, దయ, ఐకమత్యం సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని కోరారు. క్రీస్తు మార్గం ఆదర్శనీయమన్నారు. దైవ సేవకులకు ప్రభుత్వం రూ.5వేలు ప్రోత్సాహాన్ని అందించడం హర్షణీయమన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్సీ రవిబాబును పాస్టర్లు, చర్చి సంఘ సభ్యులు తదితరులు ఘనంగా సన్మానించారు. మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు కాసులమ్మ, నాయకులు చిన్నారావు, మాజీ వైస్ ఎంపీపీ బత్తిరి రవిప్రసాద్, సర్పంచ్‌లు పాడి పోతురాజు, రేగం రమేష్, అశోక్, నైని సన్నిబాబు, నాయకులు భాస్కరరావు, సుందరరావు, జి.ప్రసాద్, నైని సూర్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం



కించుమండలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



సొలభంలోని వైద్య శిబిరంలో మహిళకు వైద్య పరీక్షలు చేస్తున్న ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ నరసింగరావు

డుంబ్రిగుడ: ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని, ఇందులో భాగంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని కించుమండ పంచాయతీలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ మునుపెన్నడూ ఏ ప్రభుత్వం చేయని విధంగా జగనన్న ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తోందన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గిరిజనుల చెంతకే సేవలందిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు విజయ, వరహాలమ్మ, వైస్ ఎంపీపీలు శెట్టి ఆనందరావు, లలిత, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు గణపతి, జగ్గునాయుడు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు శ్రీరాములు, నాయకులు సింహాచలం, చిరంజీవి, సర్పంచ్‌లు చెల్లమ్మ, నాగేశ్వరరావు, వైద్యులు ప్రేమ,రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలో సొలభం సచివాలయంలో బుధవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో నేను సైతం అంటూ ఏపీ మెడికల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు రోగులకు వైద్య సేవలు అందించారు. వైద్య శిబిరాన్ని పరిశీలించటానికి వచ్చిన నరసింగరావు రోగులకు తన వంతు సాయంగా వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. శిబిరానికి వచ్చిన వారికి ఆరోగ్య సూత్రాలను వివరించారు. సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో పాయకరావుపేట కోలాట బృందం



పాయకరావుపేట నుంచి తిరుమలలో కోలాటం ప్రదర్శనకు వెళ్లిన బృంద సభ్యులు

పాయకరావుపేట: తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో పాయకరావుపేట పట్టణానికి చెందిన కోలాటం బృందం సభ్యులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో ఈ బృందం పాల్గొని తిరుమలలో కోలాటం ప్రదర్శించింది. విశాఖపట్నానికి చెందిన హరిప్రియ భజన మండలి గురువు చందూరు పరమేశ్వర శర్మ, శిరీష శర్మ ఆధ్వర్యంలో పాల్గొన్నట్టు భజన, కోలాట బృందం సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో వి.రజని, సంధ్య, వెంకటలక్ష్మి, లోవలక్ష్మి, మణిదీపిక, సత్యభవానీ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా: పలువురికి గాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

అనంతగిరి: మండలంలోని గుమ్మకోట పంచాయతీ గుజ్జెలి సమీపంలోగల టేకుతోటవద్ద బుధవారం సాయంత్రం ట్రాక్టర్ అదుతప్పి తొట్టి బోల్తా కొట్టిన ఘటనలో తొట్టిలో ఉన్న 25 మంది గిరిజనులు గాయాలపాలైయ్యారు. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం... గొట్లిపాడు గ్రామానికి చెందిన సుమారు 30 మంది గిరిజనులు గుజ్జెలి గ్రామంలోని శ్లాబ్ పనులు నిమిత్తం ట్రాక్టర్‌లో వెళ్లి, తిరిగివస్తుండగా గుజ్జెలి సమీపంలోగల టేకు తోట వద్ద అదుపు తప్పి ట్రాక్టర్ తొట్టె బోల్తా కొట్టింది. అందులో ప్రయాణిస్తున్న 25 మంది గిరిజనుల్లో జన్ని లచ్చన్న, శోభ గంగమ్మ, పాడి కన్నమ్మ, జన్ని కన్నమ్మ, మూట నాగమణి, మజ్జి కొండమ్మ, జన్ని ఎర్రమ్మ తీవ్రగాయాలపాలై, పరిస్థితి విషమంగా ఉంది. మూట పెంటమ్మ, రాము, పెంటయ్య, లక్ష్మి,కన్నమ్మ, బుచ్చయ్య, జన్ని లక్ష్మి, వెంకట్ గాయాలపాలైయ్యారు. క్షతగాత్రులను భీమవారం పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. పరిస్థితి విషయంగా ఉన్న ఏడుగురిని మెరుగైన వైద్యసేవలను ఎస్.కోట ఏరియా ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు. క్షతగాత్రులను మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొర్రా సూర్యనారాయణ పరామర్శించి, ఆరోగ్యపరిస్థితి అడిగి తెలుసుకుని, ధైర్యం చెప్పారు.

జాబ్ మేళా రేపు

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఈ నెల 20న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సీహెచ్ సుబ్బిరెడ్డి(క్లరికల్), కె.శాంతి(టెక్నికల్) తెలిపారు. వెల్ కేర్ ఫార్మా, సిద్ధి వినాయక ఇంజినీరింగ్ వర్క్స్, దసపల్లా హోటల్, బీసీఎస్ డిజిటల్, సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, పోలినేని అసోసియేట్స్, అపోలో ఫార్మసీ తదితర కంపెనీల్లో 411 ఉద్యోగుల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. సీఎన్‌సీ ఆపరేటర్స్, సిస్టం అడ్మినిస్ట్రేటర్, ప్లంబర్, ఎలక్ట్రీషియన్, టెక్నీషియన్, సౌత్ ఇండియన్ సీడీపీ, హౌస్ కీపింగ్ సూపర్‌వైజర్, ఏసీ టెక్నీషియన్, సెక్యూరిటీ గార్డ్స్, ఫ్రంట్ ఆఫీస్ అసిస్టెంట్, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, జూనియర్ కెమిస్ట్, ట్రైనీ కెమిస్ట్, జూనియర్ ఆఫీసర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫార్మాసిస్ట్ తదితర ఉద్యోగాలను భర్తీ చేస్తున్నారు. ఆయా ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పీజీ ఉత్తీర్ణత సాధించిన 18–35 ఏళ్ల వయసు ఉన్న పురుష, మహిళా అభ్యర్థులు అర్హులు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు.

గంజాయి, సారా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

- జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా



ఉత్తమ సేవలందించిన పోలీసులకు రివార్డు అందజేస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా, ఏఎస్పీ ధీరజ్

హుకుంపేట: ఏజేన్సీ లో గంజాయి సాగు, సారా విక్రయాలు, రవాణా జరగకుండా పోలిసు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌ను ఆయన బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. గంజాయి, సారా నిల్వ చేసిన గదులను పరిశీలించారు. విధుల్లో ఉత్తమ సేవలు అందించిన కానిస్టేబుళ్లు త్రినాథ్, మోహన్‌దాసులకు రివార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ ఏజెన్సీని గంజాయిరహిత, సారా నిర్మూలన ప్రాంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు చెప్పారు. హుకుంపేట మండలంలో ఒడిశా నుంచి గంజాయి, నాటు సారా రవాణా ఎక్కువగా జరుతుందని, దీని నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఏఎస్పీ ధీరజ్, సీఐ సుధాకర్, ఎస్‌ఐ సతీష్ తదితరులున్నారు.

ఉరిపోసుకుని లారీ డ్రైవర్ ఆత్మహత్య



ఉరిపోసుకున్న డ్రైవర్ దుర్గా వెంకట రమణ మూర్తి

సబ్బవరం: మండలంలోని ఆదిరెడ్డిపాలెం పెట్రోల్ బంకు సమీపంలో ఆనందపురం–అనకాపల్లి జాతీయ రహదారి ఫ్లై ఓవర్ కిందట లారీ డ్రైవర్ ఉరిపోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక ఎస్‌ఐ ఎల్. సురేష్ అందించిన వివరాలు... అల్లూరి జిల్లా రంపచోడవరం మండలం సిరిగండపాడు గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ దుర్గా వెంకట రమణమూర్తి(45) ఈ నెల 12న గుంటూరులో పెన్నా సిమెంట్ కంపెనీ నుంచి లోడ్‌తో అనకాపల్లి జిల్లా మునగపాకకు బయలుదేరాడు. ఈ నెల 16న మునగపాక చేరుకుని శ్రీభాగ్యలక్ష్మి సిమ్మెంట్ షాపులో అన్‌లోడు చేశాడు. అక్కడ నుంచి బయలు దేరి సబ్బవరం శివారు ఆదిరెడ్డిపాలెం సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద జాతీయ రహదారి ఫ్లై ఓవర్ కిందకు మంగళవారం రాత్రికి చేరుకుని అక్కడే లారీ నిలిపివేశాడు. సమీపంలోని దాబాలో భోజనం, టిఫిన్ చేసి బుధవారం మధ్యాహ్నం వరకూ ఫ్లై ఓవర్ సమీపంలో తిరిగాడు. మధ్యాహ్నం తర్వాత లారీ కేబిన్‌కు తాడు కట్టి ఉరిపోసుకున్నాడు. మృతుడి ఆధార్ కార్డు,మొబైల్ నెంబర్ ఆధారంగా లారీ యజమానికి సమాచారం అందించారు. స్థానిక వీఆర్వో శేషు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.మృతదేహాన్ని అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.